సాక్షి చిత్తూరు

ఆదివారం ౹ 8 ౹ డిసెంబర్ ౹ 2024

విరిసిరుల తల్లి





ఆహా ఏమీ నా భాగ్యం అని విరులు మురిసిపోయాయి. సిరులతల్లి సేవలో తరించాయి. తిరుచానూరు పద్మావతి కార్తీక బ్రహ్మోత్సవాల అనంతరం శనివారం అమ్మవారికి వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పార్చన చేశారు. దేశ, విదేశాలకు చెందిన 12 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలు సుమారు 4 టన్నులతో శ్రీవారి దేవేరికి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. భక్తులు యాగం వీక్షించి, తరించారు. – చంద్రగిరి

న్యూస్‌రీల్

అత్యవసర విభాగంపై అపోలో నిఘా

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రభుత్వ వైద్యాధికారులు, అపోలో ఆస్పత్రి నిర్వాహకులు పూర్తి బాధ్యత తీసుకుంటున్నారు. గత నెల 28వ తేదీన సాక్షి దినపత్రికలో 'పేదలాస్పత్రికి జబ్బు' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఆరా తీసింది. అక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకుంది. అపోలో నిర్వాహకులు సైతం స్పందించాల్సి వచ్చింది. ప్రధానంగా వైద్యాధికారుల డ్యూటీ విధి విధానాలపై శ్రద్ధ చూపుతున్నారు. డ్యూటీ సమయంలో డాక్టర్లు విశ్రాంతి తీసుకునేందుకు మూడు గదులు కేటాయించారు. రెఫర్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. అత్యవసర విభాగంలో మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రజల వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తే తక్షణం వైద్యులు, సిబ్బందిని తొలగించేలా హెచ్చరికలు జారీ చేశారు. ఇంకా మరిన్ని సీసీ కెమెరాలు బిగించి అత్యవసర విభాగంలో మెరుగైన వైద్యం అందించే దిశగా అడుగులు వేస్తున్నట్లు అపోలో నిర్వాహకులు నరేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

రుచితోపాటు శుభ్రత ఉండాలి



తనిఖీ చేస్తున్న ఈఓ పెంచల కిషోర్

కాణిపాకం: వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ప్రసాదం రుచికరంగా, పరిశుభ్రంగా అందించాలని ఈఓ పెంచల కిషోర్ ఆదేశించారు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్య అన్నదానాన్ని శనివారం తనిఖీ చేశారు. భక్తులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. భక్తులకు రుచికరమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. శుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

తిరుపతి ఎస్పీకి చిత్తూరు అదనపు బాధ్యతలు

చిత్తూరు అర్బన్: తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుకు చిత్తూరు ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం చిత్తూరు ఎస్పీగా ఉన్న మణికంఠ చందోలు వ్యక్తిగత పనులపై ఈనెల 11వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఆయన వచ్చేంత వరకు తిరుపతి ఎస్పీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమోషీ ఆదేశాలు జారీ చేశారు.


నేడు డీఆర్‌సీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 8వ తేదీన డీఆర్‌సీ (జిల్లా స్థాయి సమీక్ష సమావేశం) నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించేందుకు ఆదివారం జెడ్పీలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీ, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హాజరవుతారని కలెక్టర్ వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

మహిళా మార్టు.. సర్కారు పోటు



పెనుమూరు మహిళా మార్టు



గత ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారతకు పెద్దపీట వేసింది. మహిళాభ్యున్నతి కోసం డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో మార్టులను ఏర్పాటు చేసింది. తద్వారా పలువురు మహిళలకు ఉపాధి లభించింది. మహిళల స్వీయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. స్వల్పకాలంలోనే లాభాల బాట పట్టాయి. అయితే ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విద్య, వైద్యం, వ్యవసాయాన్ని పక్కన పెట్టేసింది. మద్యాన్ని ఏరులై పారిస్తోంది. తాజాగా మహిళా సాధికారతను దెబ్బతీసేందుకు కుట్ర పన్నింది. మహిళా మార్టులను మూసేందుకు పక్కా స్కెచ్ వేసింది. మార్టులన్నీ నష్టాల్లో ఉన్నట్లు రికార్డుల్లో చూపాలని ఆడిటింగ్ అధికారులకు హుకుం జారీ చేసింది. అనంతరం నష్టాల్లో ఉన్న మార్టులను మూసేయాలని కుట్ర పన్నుతోంది.

- మార్టులను మూసేయండి
- టీడీపీ నాయకుల హుకుం
- మార్టుల ఆడిటింగ్‌లో నష్టాలు చూపాలని ఒత్తిడి
- అడకత్తెరలో వెలుగు సిబ్బంది
- అయోమయంలో మహిళా సంఘాలు

కార్వేటినగరం: "ఎన్నికల సమయంలో మా పార్టీ అధికారంలోకి వస్తే మహిళా మార్టులను మూయిస్తామని ప్రైవేటు దుకాణదారులకు మాటిచ్చాం. కాబట్టి మీరు మార్టులను మూసివేయాలి, ఇందుకు గాను ఆడిటింగ్‌లో మార్టుల నిర్వహణ నష్టాల్లో ఉన్నట్లు చూపాలి, లేదంటే చర్యలు తీవ్రంగా ఉంటాయి." అంటూ చిత్తూరు జిల్లా, గంగాధర నెల్లూరు నియోజకవర్గం, పెనుమూరులోని మహిళామార్టు నిర్వాహకులు, వెలుగు సిబ్బందిపై కొందరు టీడీపీ నాయకులు ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. ఇందుకుగాను ఇక్కడ పని చేస్తున్న వెలుగు సిబ్బందిని కూడా బదిలీ చేయించారు. అంతేగాకుండా మార్టులోని కొంతమేర వంట సరుకులను టీడీపీ నాయకులు లూటీ చేశారు. గత వారం మార్టు ఆడిటింగ్‌కు వచ్చిన వెలుగు సిబ్బందికి టీడీపీ నాయకులు హుకుం జారీ చేయడంతో వారు మార్టు నిర్వహణ నష్టాల్లో ఉన్నట్లు లెక్కల్లో తేల్చినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితులు నెలకొనడంతో మహిళా సంఘాలకు మార్టు నిర్వహణ గందరగోళంగా మారింది. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ఫలితంగా మహిళా మార్టుల నిర్వహణ వెలుగు సిబ్బంది, మహిళా సంఘాలకు చాలా ఇబ్బందికరంగా మారింది.

ప్రైవేటు వ్యాపారాలు డల్

మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి గత ప్రభుత్వం నిరంతరం కృషి చేసింది. ఇందులో భాగంగా డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ఆదుకుంది. దీంతో పాటుగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఉత్పత్తి చేసే ఆహార పదార్థాలకు మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకుగాను జిల్లా వ్యాప్తంగా పలు మండలాల పరిధిలో మహిళా మార్టుల ఏర్పాటుకు అవకాశం కల్పించింది. తద్వారా ప్రజలకు నాణ్యమైన వంట సరుకులను సరసమైన ధరలకు అందించేలా చర్యలు తీసుకుంది. పలు మండలాల పరిధిలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్టులకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని ప్రైవేటు దుకాణాల్లో వ్యాపారం అంతగా జరగలేదు.

ఉమ్మడి జిల్లా వివరాలు...

జిల్లా పేరు	సంవత్సరం	శిక్షణ పొందిన యువత	డైరెక్టర్ ప్లేస్‌మెంట్
చిత్తూరు	2023–24	294	1008
	2024–25	96	203
తిరుపతి	2023–24	133	161
	2024–25	35	78

కోట్ల రూపాయల టర్నోవర్

జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో గత ప్రభుత్వ హయాంలో తవణంపల్లె, పెనుమూరు మండలాల్లో మహిళా మార్టులను ఏర్పాటు చేశారు. 2023 ఫిబ్రవరి 28 వతేదీ తవణంపల్లె మహిళా మార్టు ప్రారంభించారు. ఇప్పటి వరకు రూ.5,50,53,636 సగటున రోజుకు రూ.1,04,071 వ్యాపారం జరుగుతోంది. పెనుమూరులో 2023 మే 10వ తేదీ మహిళా మార్టును ప్రారంభించారు. ఇప్పటి వరకు రూ.4,03,93,992 టర్నోవర్ సాగింది. అయితే సగటున రోజుకు రూ.88,196 విక్రయాలు సాగుతున్నాయి. ఈ మార్టుల ద్వారా డ్వాక్రా మహిళలు తయారు చేసే ఆహార ఉత్పత్తులను విక్రయించడం సులభతరమైంది. నాణ్యమైన ఆహార ఉత్పత్తులను సరసమైన ధరలకు ప్రజలకు అందిస్తున్నారు. దీంతో ప్రతి మహిళా మార్టులో నెలకు లక్షలాది రూపాయల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ మార్టుల నిర్వహణ వల్ల పలువురు నిరుపేద మహిళలకు ఉపాధి అవకాశం లభించింది. ప్రతి మార్టు పరిధిలో దాదాపు 10 మంది మహిళలు పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. మార్టుల నిర్వహణతో జిల్లా వ్యాప్తంగా డ్వాక్రా మహిళలు తయారు చేసే ఆహార వస్తువులకు మార్కెట్ సౌకర్యం కూడా లభించింది. మార్టుల వ్యాపారం ద్వారా మహిళా సంఘాలు కొంతమేర లాభాలను గడిస్తున్నాయి. ఈ ప్రక్రియతో మహిళా సంఘాలకు మరింత ఆర్థిక తోడ్పాటు లభిస్తోంది.



మహిళా మార్టులో అందుబాటులో ఉన్న నిత్యావసర సరుకులు

మార్టులపై టీడీపీ కన్ను

మహిళా సంఘాల ఆధ్వర్యంలో మార్టులను నిర్వహించడం వల్ల ప్రజలకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు లభిస్తున్నాయి. దీంతో మార్టులకు మంచి ఆదరణ లభిస్తుండడం టీడీపీ నాయకులకు మింగుడుపడడం లేదు. ఇందుకు అనుగుణంగా ప్రైవేటు వ్యాపారులు కూడా మార్టులను మూసివేయాలని టీడీపీ నాయకులను ఆశ్రయించారు. దీంతో మార్టులను నిర్వీర్యం చేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మహిళా మార్టులను ఏర్పాటు చేయడం వల్ల ప్రైవేటు దుకాణ దారులు తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే మార్టులను మూసివేయాలని వెలుగు సిబ్బంది, మహిళా సంఘాలపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకువస్తున్నారు. మార్టుల నిర్వహణపై ప్రతి మూడు నెలలకోసారి వెలుగు సిబ్బంది ఆడిటింగ్ నిర్వహిస్తారు. అయితే ఆడిటింగ్ చేసేందుకు కూడా తమ అనుమతి తీసుకోవాలని టీడీపీ నాయకులు హుకుం జారీ చేయడంతో పాటు, ఆడిటింగ్‌లో నష్టాలను చూపాలని, తద్వారా మార్టులను మూసివేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు.

మహిళలకు మొండి చేయి



గత ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి మహిళా మార్టులను ప్రారంభించింది. నేడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడమే కాకుండా, మహిళలు ఆర్థికంగా అభివృద్ధికి తోడ్పాటును అందించే మహిళా మార్టులను మూయించే దిశగా పని చేస్తూ మహిళలకు మొండి చేయి చూపుతోంది

– పి.గిరిధర్‌రెడ్డి, గుడ్యానపల్లి, పెనుమూరు మండలం


బెదిరిస్తున్నారు



మహిళా మార్టు ప్రారంభించాక వస్తువులు సరసమైన ధరలకే దొరుకుతున్నాయి. గత ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి మహిళా మార్టులను ప్రోత్సహించింది. అలాంటి మహిళా మార్టుల మూసివేత దిశగా కూటమి ప్రభుత్వం కక్షసాధింపులకు దిగి అధికారులను బెదిరింపులు గురిచేయడం మంచిది కాదు.

– యశోదారెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, పెనుమూరు

మహిళా సాధికార ప్రభుత్వం



గత ప్రభుత్వం అన్ని పథకాలను మహిళల పేరున అందించి మహిళా సాధికార ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుంది. కూటమి ప్రభుత్వం మహిళా అభివృద్ధిని ఓర్వలేక పోతోంది. మహిళలు జీవన భృతికోసం నిర్వహిస్తున్న మహిళా మార్టులను నిర్వీర్యం చేసి, వాటి జాడ లేకుండా చేయడానికి టీడీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారు.

– నరసింహారెడ్డి, రామకృష్ణాపురం మాజీ సర్పంచ్, పెనుమూరు మండలం

ప్రజా సమస్యలు పట్టవా?

- వ్యవసాయ సర్వీసులు త్వరగా ఇవ్వండి
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు
- సమస్యలు ఏకరువు పెట్టిన జెడ్పీటీసీలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పక్కన సీఈఓ రవికుమార్‌నాయుడు

చిత్తూరు కార్పొరేషన్: మండల పరిధిలో జెడ్పీటీసీలకు కేటాయించిన అభివృద్ధి పనులను సకాలంలో ఎందుకు చేయడం లేదని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధికారులను ప్రశ్నించారు. శనివారం జెడ్పీలోని చైర్మన్ చాంబర్‌లో చైర్మన్ అధ్యక్షతన, సీఈఓ రవికుమార్‌నాయుడు ఆధ్వర్యంలో 1,7, 2, 4 స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. అదే సమయంలో సీఈఓ కార్యాలయంలో 3, 5, 6 సంఘాల సమావేశాలు డిప్యూటీ సీఈఓ జుబేదా అధ్యక్షతన వైస్ చైర్మన్ రమ్య, స్త్రీ శిశు సంక్షేమ కమిటీ చైర్మన్ భారతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత అధికారులు పలు అంశాలపై మాట్లాడారు.

జెడ్పీటీసీలకు వేతనం ఇవ్వండి

జిల్లాలో పలునెలలుగా పెండింగ్‌లో ఉన్న జెడ్పీటీసీల గౌరవ వేతనం మంజూరు చేయాలని పలువురు జెడ్పీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాల కింద చేసిన పనులకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా సచివాలయం, వాటి సమీపంలో మరుగుదొడ్లు, అంగన్‌వాడీ భవనం, బల్క్‌మిల్క్ యూనిట్లు, రైతు భరోసా కేంద్రాలను పంచాయతీల పరిధిలో నిర్మించామన్నారు. దాదాపు పనులు పూర్తయినా డబ్బులు ఇవ్వడం లేదన్నారు. ఆ భవనాలను ఎందుకు వినియోగంలోకి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 2014–19లో చేసిన పనులకు సంబంధించి 2.5 శాతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. 2015–16లో జలవనరులశాఖ ద్వారా చేసిన పనులకు సంబంధించి బిల్లులు ఇవ్వలేదన్నారు. జీడీనెల్లూరు జెడ్పీపాఠశాల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. చీకటిపడితే అల్లరి మూకలు గంజాయి తాగుతూ మత్తులో తూలుతున్నారని ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతం తగ్గిందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రహరీ గోడ ఎత్తు పెంచాలని, రక్షణ కల్పించాలని కోరారు. వీటిపై మండల విద్యాశాఖాధికారికి తెలిపినా, పాఠశాల సమీపంలో పోలీసుస్టేషన్ ఉన్నా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ పింఛన్ తీసుకోవడానికి కావాల్సిన అర్హత, వివరాలు సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు.

రోడ్డు నిర్మాణంపై నిర్లక్ష్యం

మండల పరిధిలో చేపట్టాల్సిన పనులను అధికారులు అలసత్వంతో పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పలమనేరు నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నరన్నారు. పలమనేరు–ముశబాగల్ మార్గంలో కీలపట్ల వద్ద సర్వీసు రోడ్డులో వర్షపునీరు నిలిచిపోతోందని పేర్కొన్నారు. అక్కడ అండర్‌పాస్ రోడ్డు నిర్మించాలని అధికారులకు చెప్పినా ఫలితం లేదన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో రోడ్డు మరమ్మతు పనులు చేయడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతులకు సకాలంలో విద్యుత్ సర్వీసులు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. విద్యుత్ సమస్యతో పంటలు వేసుకోలేక రైతులు అల్లాడుతున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో వేలాది సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారులను అడిగితే మెటీరియల్స్ లేవని అంటున్నారని చెప్పారు. పీఎం సూర్యఘర్ ద్వారా సౌర ఫలకాల ఏర్పాటు అంశంపై ఆరా తీశారు.

నిర్వహణ లోపం

జెడ్పీ స్టాండింగ్ కమిటీల సమావేశం నిర్వహణ లోపం కనపడుతోంది. సమావేశాలను సంఘాల వారీగా నిర్వహించడం లేదని విమర్శలు వస్తోంది. ఒకేసారి గుంపుగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కమిటీ కమిటీకు జెడ్పీటీసీలు మారడం జరగాలి కానీ అలా కనిపించడం లేదు. ఒకేసారి సమావేశం మొదలుపెట్టి వారితోనే చివరి వరకు ముగించేస్తున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన జెడ్పీ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు రంగన్న, పార్వతి, కేశవులు, దామోదర్, సోము, మురళీ, గాంధీ, శివన్న, లక్ష్మీప్రియ, కరుణాకర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా..

సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు కానీ అధికారులు మాత్రం సరైన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో వచ్చామా.. వెళ్లామా అన్నట్లు తూతూమంత్రంగా ముగిసింది.

క్లుప్తంగా

కుప్పంలో సినిమా థియేటర్లకు నోటీసులు

కుప్పం: పట్టణంలోని పలు సినిమా థియేటర్లు రెవెన్యూ అధికారుల శనివారం నోటీసులు అందజేశారు. పగ్గణంలో లక్ష్మీ మూవీల్యాండ్, మహలక్ష్మీ సినిమా థియేటర్లల్లో పుష్ప-2 సినిమా ప్రదర్శనను నిలిపి వేయాలని ఈ నోటీసులు అందజేశారు. థియేటర్లు యాజమాన్యం ప్రభుత్వానికి లైసెన్స్ ఫీజులు సక్రమంగా చెల్లించక పోవడంతో ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం సినిమా థియేటర్ల యాజమాన్యం అధికారులతో మాట్లాడి సినిమా ప్రదర్శనకు ఆటంకం లేకుండా చేశారు. ప్రస్తుతం పుష్ప-2 సినిమా పట్టణంలోని మూడు థియేటర్లలో ప్రదర్శిస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వ్యక్తి మృతి

తవణంపల్లె: మండలంలో శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటల్లో చిక్కుకొని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, దిగువమాఘంలో సీతారామనాయుడు(72), భార్య భానుమతితో కలిసి నివసిస్తున్నారు. శనివారం ఉదయం భార్య ఇంటి బయట ఉండగా సీతారామనాయుడు ఇంటిలోని రిఫ్రిజిరేటర్ స్విచ్ ఆన్ చేసి ఓపెన్ చేశాడు. షార్ట్‌సర్క్యూట్ కావడంతో రిఫ్రిజిరేటర్‌లో మంటలు చెలరేగాయి. ఆ మంటల్లో చిక్కుకున్న సీతారామనాయుడు శరీరం కాలిపోయింది. ఇంట్లోని వస్తువులు సైతం కాలి బూడిదయ్యాయి. సీతారామనాయుడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

9 మంది ఎంపీహెచ్‌ఏల తొలగింపు

కాణిపాకం: కూటమి ప్రభుత్వం రాకతో కడుపుకోతలు మొదలయ్యాయి. వైద్యారోగ్య శాఖ చరిత్రలో ఉద్యోగాలకు ఎసరు పెట్టారు. 2002 నాటి కాంట్రాక్టు మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు-మేల్ (ఎంపీహెచ్‌ఏ) ఉద్యోగాల నోటిఫికేషన్‌లో మార్పులు, చేర్పుల కారణంగా ఏకంగా ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చింది. ఉద్యోగులు రోడ్డున పడాల్సి వచ్చింది. అప్పట్లో నోటిఫికేషన్ విడుదలైనప్పుడు.. ప్రస్తుతం తీర్పు వచ్చినప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో వివిధ పీహెచ్‌సీలు, ఉప కేంద్రాల్లో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (మేల్) ఉద్యోగులుగా పనిచేస్తున్న 9 మంది కాంట్రాక్టు ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఉత్తర్వులు అమలయ్యేలా ఆదేశాలు రావడంతో ఆయా కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించి పీహెచ్‌సీల నుంచి రిలీవ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల వైద్యారోగ్య శాఖాధికారులకు ఆదేశించింది. ఈ మేరకు 9 మందిని విధుల నుంచి తొలగిస్తూ డీఎంహెచ్‌ఓ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

అప్పట్లో ఇలా....

జీఓ 1207 ప్రకారం 2002లో మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ విడుదలైంది. మొదట పదో తరగతి విద్యార్హతతో ఉద్యోగాలు ఇచ్చేలా నిర్ణయించారు. అయితే ఇంటర్ ఒకేషనల్ గ్రూప్ వారికే ఈ ఉద్యోగాలు ఇవ్వాలంటూ కోర్టులను ఆశ్రయించారు. దీనిపై అప్పట్లో మళ్లీ నోటిఫికేషన్‌కు సవరణలు చేసి ఉమ్మడి పరీక్ష ద్వారా పది, ఇంటర్ విద్యార్హతలు గల వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఇందులో కూడా అత్యధికంగా పదో తరగతి అర్హత ఉన్న వారే ఉద్యోగాలు సాధించడంతో మరికొందరు తమకు మాత్రమే ఈ పోస్టులు ఇవ్వాలంటూ కోర్టుకెక్కారు. ఇదే తంతు కొన్నాళ్లు సాగగా, తాజాగా ఈ పోస్టుల్లో ఉన్నవారిలో విద్యార్హతతో పాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్ కూడా పాటించలేదని, కేవలం అడ్డదారిలో నియామకాలు జరిపారంటూ కోర్టు నిర్ధారించి తుది తీర్పును గురువారం వెలువడించింది.



కొంగారెడ్డిపల్లి షర్మన్ బాలికోన్నత పాఠశాల గేటు వద్ద టీడీపీ ప్రచార బ్యానర్లు

ఆర్భాటం.. తూతూమంత్రం!

జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశానికి తల్లిదండ్రులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాభివృద్ధి కోసం చేసిందేమీ లేదు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకపోవడంతో తల్లిదండ్రులు సమావేశాలపై ఆసక్తి చూపలేదు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో శనివారం పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలను తూతూ మంత్రంగా నిర్వహించి విద్యాశాఖ అధికారులు చేతులు దులుపుకున్నారు.

- మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు స్పందన కరువు
- తల్లిదండ్రుల హాజరు నామమాత్రమే
- విజయపురంలో డీఈఓను నిలదీసిన తల్లిదండ్రులు
- కొన్ని పాఠశాలల్లో 12 గంటలకే కార్యక్రమం ముగింపు

చిత్తూరు కలెక్టరేట్ : మెగా పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశాలకు తల్లిదండ్రులను అధిక సంఖ్యలో రప్పించాలని కూటమి సర్కారు టీచర్లపై గత నెల రోజులుగా ఒత్తిడి తీసుకొచ్చింది. గత నెల రోజులుగా ప్రతి రోజు కాన్ఫరెన్స్‌ల పేరుతో డీవైఈవో, ఎంఈవోలపై ఒత్తిడి పెంచేశారు. అయితే శనివారం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 2,444 పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాలకు స్పందన కరువైంది. ఉదయం 9.30 గంటలకు సమావేశాలను ప్రారంభించారు. చాలా వరకు పాఠశాలల్లో 10.30 గంటలకు తల్లిదండ్రులు తూతూమంత్రంగా సమావేశాలకు విచ్చేశారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 320 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాలలో నిర్వహించిన సమావేశాలకు 110 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు. ఇదే విధంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పరిస్థితి కనిపించింది. తక్కువ సంఖ్యలో హాజరైన తల్లిదండ్రులు సైతం తమకు పనులున్నాయంటూ అరగంట కూడా పాఠశాలల్లో ఉండకుండా వెనుదిరిగారు. ఉన్న అతి తక్కువ మంది తల్లిదండ్రులతో పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశాలను విద్యాశాఖ అధికారులు మమ అనిపించేశారు.

ఎవరి మెహర్బానీ కోసం ఈ సమావేశాలు....

కూటమి సర్కారు ఎవరి మెహర్బానీ కోసం ఈ సమావేశాలు నిర్వహిస్తోందని నగరి నియోజకవర్గం విజయపురంలోని జెడ్పీ హైస్కూల్లో తల్లిదండ్రులు డీఈవో వరలక్ష్మిని నిలదీశారు. ఆ పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి అతిథిగా వెళ్లిన డీఈవోకు చేదు అనుభవం ఎదురైంది. నాడు నేడు పనులు ఎందుకు ఆపేశారంటూ తల్లిదండ్రులు ప్రశ్నించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నాడు నేడు నిధులు ఏమయ్యాయంటూ అడిగారు. పాఠశాల అభివృద్ధికి మంజూరు చేసిన రూ.3 లక్షల నిధులు ఎందుకు ఖర్చు చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలు చదివే పాఠశాల అభివృద్ధి ప్రభుత్వానికి పట్టదా అంటూ ప్రశ్నించారు. మరుగుదొడ్లు, కనీస వసతులు లేకుండా విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నప్పటికీ కూటమి సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఆరు నెలలు పూర్తవుతున్నా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇందుకు డీఈవో వరలక్ష్మి ఎలాంటి సమాధానాలు చెప్పలేక అక్కడి నుంచి వెనుదిరగాల్సిన దుస్థితి ఏర్పడింది.

గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం 49 కొత్తపల్లి మిట్టలో జరిగిన సమావేశంలో పాఠశాలకు రావాలంటే సమయానికి బస్సులు రావడం లేదని విద్యార్థులు ఎమ్మెల్యే థామస్‌ను ప్రశ్నించారు. మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్న తమకు ఇంత వరకు జీతం ఇవ్వలేదని ఆ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కోసం సమావేశాన్ని మధ్యాహ్నం 1.15 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే, కలెక్టర్లు హాజరయ్యాక ఇరవై నిమిషాల పాటు తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించారు. ఆ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటలకు భోజనం పెట్టారు. దీంతో అక్కడికి విచ్చేసిన తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు మండలంలో నిర్వహించిన సమావేశాల్లో ప్రోటోకాల్ నిర్వహించకపోవడంతో ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. పలువురు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం పట్ల విద్యాశాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లి వద్ద ఉన్న షర్మన్ బాలికోన్నత పాఠశాల ఎదుట టీడీపీ బ్యానర్లను ఏర్పాటు చేయడం విమర్శలకు తావిచ్చింది.

గంట సమావేశంలో ఏం వివరించారో..

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశాల్లో గంట పాటు మాత్రమే తల్లిదండ్రుల సమావేశానికి ప్రాధాన్యమిచ్చారు. మిగిలిన సమయం అంతా తల్లిదండ్రులు సమస్యలు వెల్లడించేందుకు ఆస్కారం లేకుండా ఆటల పోటీలు పెట్టి కాలయాపన చేశారు. హైస్కూల్స్‌లోని తరగతుల్లో వందల మంది విద్యార్థులుంటే ఒక్కో విద్యార్థి ప్రగతిని చర్చించేందుకు కనీసం 10 నిమిషాలైనా అవుతుంది. అలాంటిది ఒక గంటలోనే అందరి విద్యార్థుల ప్రగతిని వివరించారంటే ఈ సమావేశాల నిర్వహణ ఎలా ఉందో అర్థమవుతోంది. మరికొన్ని పాఠశాలల్లో అన్ని తరగతుల విద్యార్థులను ఒకో చోట కూర్చోబెట్టి ప్రోగ్రెస్ కార్డులు అందజేసి చేతులు దులుపుకున్నారు. ఈ సమావేశాల్లో మొత్తం సంక్షేమ పథకాల ఊసెత్త కుండా సమావేశాలు నిర్వహించారని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు.

మధ్యాహ్నం 12 గంటలకే సమావేశాలు ముగింపు

జిల్లాలోని చాలా వరకు పాఠశాలల్లో మధ్యాహ్నం 12 గంటలకే సమావేశాలను ముగించేశారు. ప్రాథమిక పాఠశాలల్లో అయితే సమావేశాలు మరీ దారుణంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. ఇందుకు ప్రత్యేక షెడ్యూల్‌ను సైతం అధికారులు విడుదల చేశారు. అయితే ఆ షెడ్యూల్ ప్రకారం సమావేశాలు ఎక్కడా నిర్వహించ లేదు. ఈ సమావేశాలకు తక్కువ సంఖ్యలో తల్లిదండ్రులు హాజరైనప్పటికీ ఉన్నతాధికారులు, సర్కారు మెప్పు కోసం విద్యాశాఖ అధికారులు తప్పుడు లెక్కల నివేదికలను సిద్ధం చేశారు.

స్వాగతాలు.. ఆటలతోనే సరి! సమస్యల ఊసేది?

పలమనేరు: నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. ఇందుకు హాజరయ్యే తల్లిదండ్రులు సమస్యలు ప్రస్తావించకుండా స్కెచ్ వేశారు. బడి వద్దకు తల్లిదండ్రులు రాగానే వారిపై పూలను చల్లుతూ స్వాగతాలు పలికి, ఆపై వారికి ఆటలపోటీలు నిర్వహించి బురిడీ కొట్టించారు. దీంతో అసలు సమస్యల గురించి ప్రస్తావించకుండానే సమావేశాలు సరదాగా ముగిసేలా చేశారు. ప్రభుత్వ బడులను ఇలా మార్చింది గత ప్రభుత్వమనే మాట రాకుండా సమావేశాలను జాగ్రత్తగా నిర్వహించారు. ముఖ్యంగా బడుల్లోని సమస్యలు, మిడ్‌డే మీల్స్ కష్టాలు, అమ్మఒడి రాకపోవడం, తల్లికి వందనం ఇవ్వకపోవడంపై తల్లిదండ్రులు ప్రశ్నించకుండా తగు జాగ్రత్తలను తీసుకున్నారు. దీంతో తల్లిదండ్రులకు టగ్‌ఆఫ్ వార్, రంగోళి లాంటి పోటీలు, పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు, నాయకుల ఉపన్యాసాలకు పెద్దపీట వేశారు. ఆపై తల్లిదండ్రులు, పిల్లలకు విందుభోజనాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి స్థానిక ఆర్‌డీఓ భవాని హాజరై మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. ఇదే కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎంఈవోలు లీలారాణి, బాల సుందరం, పట్టణానికి చెందిన టీడీపీనేతలు హాజరయ్యారు.



తల్లిదండ్రులకు పూలతో స్వాగతం పలుకుతున్న టీచర్లు



తల్లులకు ముగ్గుల పోటీలు

కోటమల్లై అయ్యప్ప సన్నిధిలో పెద్దిరెడ్డి



అయ్యప్ప స్వామి సేవలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం సందర్శించారు. తిరుపతిలో అయ్యప్ప మాలధారణ చేసిన ఆయన స్వామివారి దర్శనానికి ఇక్కడికి వచ్చారు. ఆలయంలోని వినాయక, ఆంజనేయ, నాగమల్లేశ్వర, అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. మధ్యాహ్నం భక్తులతో కలసి అన్నప్రసాదం స్వీకరించారు. పలువురు సమస్యలపై వినతులు అందివ్వగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, ఎంపీపీలు ధనుంజయ రెడ్డి, సురేంద్రనాథ రెడ్డి, నాయకులు ప్రకాష్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, సుబ్బారెడ్డి, ఇమ్రాన్, బాబురెడ్డి, మనోహర్ రెడ్డి, పుత్రాజు, నాగరాజు, హరినాథ రెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

కాణిపాకం: పూతలపట్టు మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందింది. గువ్వల కాలనీ వద్ద వాణిశ్రీ (14) రోడ్డు దాటుతున్న క్రమంలో అతి వేగంతో వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కొత్తకోట పీహెచ్‌సీకి తరలించారు. మార్గమధ్యంలోనే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ సదస్సుల్లో రెండో రోజు 163 వినతులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా రెండవ రోజు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సదస్సుల్లో వివిధ రెవెన్యూ సమస్యలపై 163 వినతులు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ నెల 06, 07 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా 1,250 వినతులు నమోదైనట్లు తెలిపారు. ఈ వినతుల్లో 2 మాత్రం పరిష్కరించారు.

అభాగ్యురాలికి అంతిమ సంస్కారాలు



బస్టాండులో మృతి చెందిన వృద్ధురాలు

పలమనేరు:ఏ ఊరికి చెందిందో.. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు ఈ అభాగ్యురాలు.. పట్టణంలో శనివారం కన్నుమూసింది. సమాచారమందుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు ఆ వృద్ధురాలికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. సుమారు 70 ఏళ్ల వయసున్న వృద్ధురాలు శుక్రవారం రాత్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో పడుకుంది. చలికి కప్పుకోవడానికి సైతం దుప్పటిలేదు. దీంతో ఏమి జరిగిందో ఏమోగానీ ఆమె అక్కడే మృతి చెందింది. శనివారం విధులకు వచ్చిన ఆర్టీసీ కంట్రోలర్ రమణ ఆమెను గమనించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి పోలీసులు చేరుకుని ఆమెను ఒక అనాథగా భావించారు. పట్టణానికి చెందిన పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు శివ మిత్రబృందానికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఆమెను పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలను నిర్వహించారు. ఆమె వద్ద రూ.1000 నగదు లభించడంతో దాన్ని కూడా అంత్యక్రియలకు వినియోగించినట్లు హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు తెలిపారు.



ఖననం చేసిన హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు

సాయుధ దళాల నిధికి విరాళం



పతాక నిధికి విరాళం అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సాయుధ దళాల నిధికి విరాళం అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాంధీ విగ్రహం నుంచి కలెక్టర్ బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశరక్షణ కోసం అహర్నిశలు సేవలందిస్తున్న సైనికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. దేశ రక్షణలో ప్రాణాలర్పించిన సైనికులను స్మరించుకునేందుకు ప్రతి ఏటా డిసెంబర్ 7న దేశవ్యాప్తంగా సాయుధ దళాల పతాక దినోత్సవం జరుపుకుంటామన్నారు. పతాక నిధికి అందించే విరాళం సైనికుల కుటుంబీకుల పిల్లలకు స్కాలర్‌షిప్స్, ఆడపిల్లల వివాహాలు, పలు కార్యక్రమాలకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కలెక్టర్ తమ వంతు బాధ్యతగా సాయుధ దళాల పతాక నిధికి విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు, సిబ్బంది వినాయకరెడ్డి, ప్రమోద్‌కన్నా, సాయిప్రకాష్, రమేష్ , మాజీ సైనికులు వరదరాజులు, రామచంద్ర, ఎన్‌సీసీ అధికారులు, కేడెట్స్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది